క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో..) టమోటా 23, వంకాయ 23, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 26, బీర 23, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 13, కారెట్ 35. దొండ 28, ఆలు 21, ఉల్లి 24, గోకర 28, దోస 21, సొర 13, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 45, అర్వి 35, మునగ 23, చిలగడదుంప 47, బీట్‌రూట్ 23, కీర 20, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా చంద్రశేఖర్



నియామక పత్రాన్ని తీసుకుంటున్న చంద్రశేఖర్

మలక్‌పేట: టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన బోనగిరి చంద్రశేఖర్ నియమితులయ్యారు. గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. మూసారంబాగ్‌లోని నివాసంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎస్సీల వర్గాలను చైతన్య పరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేవెళ్ల సభలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, ప్రీతమ్, టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, సీనియర్ నేతలు రామ్‌శెట్టి నరేందర్, కేశవరావు పటేల్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

చంపాపేట: మూడు రోజుల క్రితం చంపాపేట కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి నివాసాన్ని బీఆర్ఎస్ పార్టీ మహిళలు, కార్యకర్తల ముట్టడికి నిరసనగా సోమవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీ నాయకులు సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, దశరథగౌడ్, అవినాష్‌రెడ్డి, యోగిరాజ్, సాయి ప్రసాద్, కృష్ణ, శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్, నరేష్, నిఖిల్, సాయి, సుమిత్, కల్యాణ్ పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో అభివృద్ధి శూన్యం

రాగిడి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: తొమ్మిదేళ్లుగా రామంతాపూర్ డివిజన్ పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ ఇందిరానగర్, రాజేంద్రనగర్, గాంధీనగర్, శ్రీరామ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పార్టీ నిర్వహించిన గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ డీమార్ట్ ఇందిరానగర్ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యి ఏళ్లు గడుస్తున్నాయి. అదేవిధంగా ఇందిరానగర్, రాజేంద్రనగర్, ఓల్డ్ రామంతాపూర్ శ్రీరామ్ కాలనీలో కలుషిత తాగునీరు సరఫరా, అస్తవ్యస్తంగా భూగర్భ డ్రైనేజీలు, గుంతల రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి స్థానిక ప్రజలతో కలిసి పెద్దఎత్తున ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పత్తి కుమార్, శ్రీనివాస్ యాదవ్, సంజయ్ జైన్, అశు, సుధాకర్, అబ్దుల్ రషీద్, మహ్మద్, రఫీక్, జలీల్, పాషా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

బోడుప్పల్: తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు కవులు, కళాకారులు, భాషాభిమానులు కలిసి కృషి చేద్దామని తెలుగు రచయిత్రి కన్నారం ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. చెంగిచర్లలో ఆమె సోమవారం మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ కమనీయ భావాల రూపుదాల్చు, రమణీయ దృశ్యాలు ఆవిష్కరించు, వీనుల విందుగా తేనెలు చిందు విధంగా తెలుగు భాష ఉంటుందన్నారు. తెలుగు రచయిత్రిగా సామాజిక పరమైన కథలు, కవిత్వాలు, గత చరిత్రపై సామాజిక విశ్లేషణ చేసినట్లు వెల్లడించారు. తెలుగు భాషను కాపాడుకునేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కేసీఆర్ ఇచ్చిన వరం 'టిమ్స్' ఆస్పత్రి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కొత్తపేటలోని టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ ప్రజానీకానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన వరం టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట పండ్ల మార్కెట్ స్థలంలో నిర్మాణం జరుగుతున్న టిమ్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ..రూ. 200 కోట్ల వ్యయంతో దేశంలోనే ఎత్తైన 26 అంతస్తుల ఆస్పత్రిని నిర్మిస్తున్నారన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు నిత్యం వచ్చే వేలాది మంది ఆరోగ్య సేవలు అందించటం భారంగా మారినందున నగరంలో నలుమూలల ఇలాంటి టిమ్స్ నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందన్నారు. చైతన్యపురి మెట్రో స్టేషన్ నుంచి నేరుగా ఆస్పత్రిలోకి వచ్చేలా ర్యాంపు నిర్మాణం, రోగుల వెంట వచ్చే వారి కుటుంబసభ్యులు సేదతీరటానికి మూడు అంతస్తుల భవనం నిర్మించి భోజన సౌకర్యం కూడా ఏర్పాటు ఉంటుందన్నారు. ఎల్‌బీనగర్ రూపురేఖలు మారుస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా అభివృద్ధి చేయగలిగామన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులకు జరుగుతున్న అభివృద్ధి కనబడటం లేదని, నాపై వ్యక్తిగత ఆరోపణలు దిగటం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట వంటిదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల మధ్య తిరుగుతూ వారి కష్టసుఖాలను పంచుకుంటున్నామని, ఇకనైనా ప్రతిపక్ష పార్టీల నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, నాయకులు శరత్‌చంద్ర, జగదీష్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ కార్డులు, కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగాణను నిలువునా ముంచిన బీఆర్ఎస్, బీజేపీలపై పార్టీ తయారు చేసిన చార్జిషీట్ కరపత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. చైతన్యపురిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. పదేళ్లుగా కేసీఆర్ నమ్మించి మోసం చేసిన విధానం గురించి టీపీసీసీ తయారు చేసిన పోస్టల్ కార్డులు, కరపత్రాలను మల్‌రెడ్డి విడుదల చేసి డివిజన్ అధ్యక్షులకు పంపిణీ చేశారు. యోగీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సదాశివుడు, వేణుయాదవ్, మంజులారెడ్డి, నర్సింహయాదవ్, మల్లారపు శ్రీనివాస్, మక్సూద్ అహ్మద్, రాజశేఖర్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

మామిడి రాంచందర్ ఘన విజయం



నాగోలు: కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మామిడి రాంచందర్ ఘన విజయం సాధించారు. ఆదివారం కాలనీలో నిర్వహించిన ప్రత్యేక ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. కాలనీవాసులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాలనీ అధ్యక్షులు మామిడి రాంచందర్ భారీ మెజారిటీతో గెలుపొందాడు. కాలనీ ప్రధాన కార్యదర్శిగా ఆకుల వెంకటేష్ ప్రత్యర్థిపై భారీ ఓట్లు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి ఏటీ భరత్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి రాంచందర్ మాట్లాడుతూ.. భరత్‌నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు కాలనీవాసులు నూతన అధ్యక్ష కార్యదర్శిలను సన్మానించారు.

ప్రాజెక్టులు రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

లింగోజిగూడ: విద్యార్థులను సమాజోపయోగ, పర్యావరణహిత పరిశోధన ప్రాజెక్టుల రూపొందించే విధంగా ప్రోత్సహించాలని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు సూచించారు. సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్-23 ప్రదర్శనలపై జిల్లా పరిధిలోని విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. నవంబర్, డిసెంబర్‌లలో జరిగే జిల్లా, రాష్ట్ర, జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనల అంశలపై అకాడమిక్ కో ఆర్డినేటర్ మురళీమోహనచారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు ప్రాజెక్టుల రూపకల్పనపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మలక్‌పేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌లోని 1519 నంబర్ మెట్రో పిల్లర్ వద్ద తెల్లవారుజామున 4 గంటలకు గుర్తుతెలియని వాహనం ఓ గుర్తు తెలియని వ్యక్తి(55)ని ఢీకొట్టడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో యాచిస్తూ ఉండేవాడని, అప్పుడప్పుడు పాత సామాన్లు సేకరించి అమ్ముకునేవాడని, అతని పేరు కృష్ణ అని చెప్పేవాడని స్థానికులు చెబుతున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సుభాష్‌చందర్జీ, అరుణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నేతలు

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సైదాబాద్ కార్పొరేటర్ అరుణా రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఇరువురి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సైదాబాద్‌లోని సుభాష్‌చందర్జీ నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేయించారు. వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు చూపిస్తున్న ఆదరణతో మరింత ఉత్తేజంగా పార్టీ పటిష్టతకు పాటుపడుతామన్నారు. రవీందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సహదేవ్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, గోపి, దినేష్‌గౌలీకర్, ఆశీష్‌గౌలీకర్, అజయ్‌రెడ్డి ఉన్నారు.

కృష్ణాదిశేషుకు సేవా నంది పురస్కారం

ఎల్‌బీనగర్: స్వతంత్ర్య దినోత్సవం, అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఆల్ ది బెస్ట్ అవార్డ్స్ అకాడమీ, కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రులు సంయుక్తంగా సన్‌షైన్ ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన సేవా నంది అవార్డ్-2023లో కేంద్రా ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు, ప్రముఖ వాస్తు నిపుణులు కృష్ణాదిశేషుకు సేవా నంది వార్డు వరించింది. ఈ అవార్డును విశ్రాంతి న్యాయ మూర్తులు చంద్రయ్య, ఎంఎస్‌కే జశ్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాదిశేషు మాట్లాడుతూ.. ఈ అవార్డు వరించడం ఎంతో సంతోషంగా ఉందని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ఈ అవార్డు దోహదపడుతుందని తెలిపారు.



చంద్రయ్య, జశ్వాల్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న దృశ్యం

నేడు 'చలో మైదాన్'

హుడాకాంప్లెక్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 'చలో మైదాన్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఉదయం 10గంటలకు ఇండోర్ స్టేడియంలో క్రీడలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

'సేవా కార్యక్రమాల్లో ముందుంటాం'



అమ్మాయిల పెళ్లికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడు ముందుంటామని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సిద్దిపేట టౌన్ కేసీఆర్‌నగర్‌కి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బైరి సుభద్ర-శ్రీనివాసులు కూతురు ఇవాన్షి (ఆకాంక్ష) వివాహం, యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మచ్చ నరసింహ-పద్మ కూతురు లావణ్య వివాహం కోసం సోమవారం నాగోలులోని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌గుప్తా చేతుల మీదుగా పేదింటి వధువులకు పుస్తె మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు.

రోడ్డు పనుల పరిశీలన

బోడుప్పల్: 24వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతామన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీనివాసకాలనీలో నిలిపివేసిన తాగునీటి పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఆ పార్టీ కార్పొరేటర్లు సోమవారం వనస్థలిపురంలో జలమండలి కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కార్పొరేటర్లకు చెప్పకుండా కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నా కాలనీల అభివృద్ధికి తాము పనులను అడ్డుకోవడం లేదని అన్నారు. జలమండలి అధికారులు బీజేపీ కార్పొరేటర్లు ఉన్నచోట పనులు చేపట్టడం లేదని పేర్కొన్నారు. శ్రీ శ్రీనివాస కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించే వరకు జలమండలి కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బుధవారం నుంచి పనులు చేపడతామని జీఎం వినోద్ హామీ ఇవ్వడంతో కార్పొరేటర్లు నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నవజీవన్ రెడ్డి, నర్సింహారెడ్డి, అరుణ, ప్రేమమహేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

మార్కెట్ అభివృద్ధికి కృషి

చాదర్‌ఘాట్: మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట మార్కెట్ ఆవరణలో రూ.52 లక్షలతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ చైర్మన్ భూమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు. మార్కెట్‌లోని రైతులు, వ్యాపారులు, ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ అనితనాయక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 32లక్షలు, మార్కెట్ నిధులు రూ.20 లక్షలతో 300 ఎంఎం డయా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు వివరించారు. మార్కెట్‌లో నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయడంతో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బలాల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆమె వివరించారు.

'దివ్యాంగులపై చిన్న చూపు తగదు'



మాట్లాడుతున్న గోవర్ధన్

హయత్‌నగర్: దివ్యాంగులను రాజకీయంగా సామాజికంగా చిన్న చూపు చూస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు తగిన ప్రాధాన్యమివ్వాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలమండ్ల గోవర్ధన్ అన్నారు. వీహెచ్‌పీఎస్ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విహెచ్‌పీఎస్ పోరాట ఫలితంగానే పింఛన్లను 4 వేల వరకు పెంచారన్నారు. రైతు బంధు, దళిత బంధు లాగానే దివ్యాంగుల బంధు ఇవ్వాలని, 5 శాతం రిజర్వేషన్ ప్రకారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యమివ్వాలని, గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక హోదాను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, మల్లేష్, దేవిప్రసాద్, ప్రణీత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



అందెల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల

బడంగ్‌పేట్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో అందెల శ్రీరాములు సమక్షంలో గాంధీనగర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్, బీజేవైఎం నగర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, అరవింద్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, న ర్సింగ్, నరేందర్ కుమార్, మహేష్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మంత్రి సబితారెడ్డి



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని డబీల్‌గూడ, నాగారం, గొల్లూరు గ్రామాల్లో మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సోమవారం రూ.2 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్స్ ఇవ్వడంతో పాటు ఇంటి వద్ద ఖాళీ జాగా ఉండి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సహాయం అందిస్తుందన్నారు. డబీల్‌గూడలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మా ణం పనులకు శంకుస్థాపన, నాగారం-పడమటితండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, గొల్లూరులో నూత న గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, డబీల్‌గూడ, నాగారం, పడమటి తండా, గొల్లూరు గ్రామ సర్పంచ్‌లు బి.శంకర్, లావణ్య, అనితా నాయక్, కవిత, ఎంపీటీసీ సభ్యులు స్వప్న, వెంకటేష్, రమేష్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మహేశ్వరం: మున్నురుకాపుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన మున్నురు కాపు ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్నూరుకాపుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. మున్నూరుకాపు సంఘం మినీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం నాయకులు కోరగా మంత్రి సానుకూలంగా సన్మానించారు. అమీర్‌పేట్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రఘుపతి, గ్రామ ఉపసర్పంచ్ నర్సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ద నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు రాయప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవవరం గౌడ్, మున్నూరు కాపు సంఘం కోశాధికారి శ్రీశైలం, జనరల్ సెక్రటరీ భిక్షపతి, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామంలో సోమవారం బాలంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకం, హారతి, కుంకుమార్చన, పుష్పాలంకరణతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిగురింత పారిజాతరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ నాయకులు కొత్త మనోహర్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మొహబ్బత్‌నగర్ గ్రామ సర్పంచ్ సువర్ణ, ఉపసర్పంచ్ మానస శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రామిరెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ సువర్ణ, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీరాములు యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శివయాదవ్ పలువురు పాల్గొన్నారు.